జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 14-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 671 పేజీలు: 4 వెల : రూ.7



## వంశధార గుండెలో..
# ఇసుక వేట!

* అధికార అండదండలతో చెలరేగుతున్న ఇసుక మాఫియా?
* వంశధార దోపిడీలో ఆ 'పెద్దల' హస్తమెవరిది?
* కాసుల వేటలో అధికార 'ముఖ్య' నేతలు
* పొంటూరు, బంకి వద్ద నది గర్భంలోకి రోడ్లు
* భారీ యంత్రాలతో తవ్వకాలు
* రోజుకు వందల వాహనాలతో ఇసుక ఒడిస్సాకు తరలింపు
* పత్రికల్లో కథనాలు వచ్చినా 'చోద్యం' చూస్తున్న అధికార యంత్రాంగం

**కొత్తూరు, మే 13 (వార్త):** పాతపట్నం నియోజకవర్గం, కొత్తూరు మండలం మీదుగా ప్రవహిస్తున్న వంశధార నది ఇసుక మాఫియాకు ఏటీఎంలా మారిపోయింది. చట్టంలోని నిబంధనలు, పర్యావరణం అనే పదాలకు అక్కడ తావు లేదు. కేవలం 'అధికారం.. అక్రమం' అనే సూత్రంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పొంటూరు, బంకి పరిసర ప్రాంతాల్లో నదీ తీరం ఇప్పుడు అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారింది. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, మన రాష్ట్ర సహజ సంపద యథేచ్ఛగా సరిహద్దులు దాటి పక్క రాష్ట్రం ఒడిస్సాకు తరలిపోతోంది. సాధారణంగా నదిలో ఇసుక తీయాలంటే అనేక నిబంధనలు ఉంటాయి. కానీ ఇక్కడ మాఫియా సొంత రాజ్యాంగాన్ని నడుపుతోంది. ఏకంగా నది గర్భంలోకి భారీ వాహనాలు వెళ్లేలా తాత్కాలిక రహదారులను నిర్మించారంటే వీరి తెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భారీ ప్రొక్లయిన్లను రంగంలోకి దింపి, నది గుండెలను చీల్చి ఇసుకను తోడేస్తున్నారు. భూగర్భ జలమట్టం పడిపోతుందన్న ఆందోళనను పక్కనపెట్టి, కేవలం కాసుల కక్కుర్తితో నది ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారు. విచిత్రం ఏమిటంటే కొన్నిరోజుల క్రితం ఈ పొంటూరు ఇసుక ర్యాంపునకు దారి కోసం ఏకంగా వంశధార వరద ప్రవాహం ఊర్లోకి రాకుండా అడ్డుగా వేసిన కరకట్టను సైతం తవ్వేశారంటే ఇక్కడ ఈ ఇసుకాసురులకు అండ బలం, అంగ బలం ఎంతలా ఉందో అర్థమవుతుంది.. అయితే ఇక్కడ తవ్విన ఇసుక స్థానిక అవసరాలకు కాకుండా, భారీ లాభాల కోసం పక్క రాష్ట్రమైన ఒడిస్సాకు అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ఒడిస్సా రిజిస్ట్రేషన్ కలిగిన భారీ వాహనాలు బారులు తీరి ఇసుకను తరలిస్తున్నాయి. సరిహద్దుల వద్ద నిఘా నీడలో ఉండాల్సిన ఈ వాహనాలు అధికారుల కళ్లముందే దర్జాగా వెళ్తుండటం వెనుక భారీ స్థాయి రాజకీయ లాబీయింగ్ ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలు పత్రికల్లో కథనాలు వస్తాయి.. అధికారులు వచ్చి చూస్తారు.. కానీ తవ్వకాలు మాత్రం ఆగవు. ఇదీ ఇక్కడ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితి. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా, ఉన్నతాధికారులు తనిఖీలు చేసినా మరుసటి రోజే మళ్లీ యంత్రాలు గర్జిస్తున్నాయి. ఈ అక్రమ దౌర్జన్యానికి అండదండలు అందిస్తున్న ఆ ప్రభావశీలురైన నాయకులు ఎవరు? అధికారులను సైతం శాసించగలిగే ఆ శక్తుల వెనుక ఉన్నది ఎవరు? అనేది ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రకృతిని నాశనం చేస్తున్న ఈ ఇసుక మాఫియాపై తక్షణమే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కంటితుడుపు తనిఖీలు కాకుండా, నది గర్భంలో వేసిన రహదారులను తొలగించి, భారీ యంత్రాలను సీజ్ చేయాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న నేతలను బట్టబయలు చేయాలని బాధితులు కోరుతున్నారు.














జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఏరియా ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ

**నరసన్నపేట, మే 13(వార్త):** నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యులు విధులకు గైర్హాజరవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించిన ఆమె, విధులకు హాజరై మధ్యలో వెళ్లిపోతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, హాజరు నమోదులు, మౌలిక సదుపాయాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏవో రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



### పాగోడు జడ్పీ పాఠశాలలో

## శత శాతం ఉత్తీర్ణత

### -విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన ఎంఈఓ

**జలుమూరు, మే 13(వార్త):** ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జలుమూరు మండలం పాగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం కోటి బాబు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని పాఠశాల విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి ప్రతిభ కనబరిచారని హెచ్ఎం కోటి బాబు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## జన చైతన్యంతో వెల్లివిరిసిన పరిశుభ్రత

### - చల్లబందలో అట్టహాసంగా "స్వచ్ఛపథం" కార్యక్రమం

**పోలాకి, మే 13(వార్త):** కుసుమపోలవలస పంచాయతీ పరిధిలోని చల్లబంద గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "స్వచ్ఛపథం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పాల్గొని గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని అందించారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాలు, పట్టణాలను




పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరిస్తే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామాల్లో డ్రైనేజీలు, రహదారులు, తాగునీటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు నిరంతరం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, స్వచ్ఛంద కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**నరసన్నపేట, మే 13 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం పరిశీలించారు. ఉదయం స్థానిక కేంద్రానికి చేరుకున్న ఆయన అక్కడ చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కేంద్రంలో మౌలిక సదుపాయాలు, యంత్రాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కేంద్రానికి ప్రత్యేక అధికారిగా ఆమదాలవలస మున్సిపాలిటీ కమిషనర్ తమ్మినేని రవి ను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ నెల 15వ తేదీ నాటికి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## నరసన్నపేట విద్యార్థుల ప్రతిభ



**నరసన్నపేట, మే 13 (వార్త):** ఏపీఆర్జేసీ ఫలితాల్లో నరసన్నపేటకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. ఎంఈసీ విభాగంలో ఎలమంచి మహేష్ కుమార్ రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంకు సాధించగా, ఎంపీసీ విభాగంలో ఎం. పవన్ కుమార్ 194వ ర్యాంకు, కూర్మాన డిల్లేశ్వరి 319వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు.

విద్యార్థుల విజయంపై పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

## విద్యార్థుల వేసవి వర్క్ పరిశీలన




**నరసన్నపేట, మే 13(వార్త):** గోపాలపెంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలిమ విద్యార్థులకు ఇచ్చిన వేసవి వర్క్‌ను బుధవారం ఉదయం పరిశీలించారు. వేసవి సెలవులను కేవలం ఆటపాటలకు మాత్రమే పరిమితం కాకుండా చదువుపై కూడా దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటి వద్ద వారు చదువుతున్న తీరు, హోంవర్క్ పూర్తి చేస్తున్నారా లేదా అనే విషయాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు సెలవుల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించే దిశగా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

## రుద్రభూమి మార్గంలో చెత్త డంపింగ్‌పై స్థానికుల ఆగ్రహం

**నరసన్నపేట, మే 13(వార్త):** నరసన్నపేటలోని పలు ప్రాంతాల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలను కొత్త కర్ర చెరువు, రుద్రభూమికి వెళ్లే మార్గంలో గత వారం రోజులుగా డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ చెత్త నిల్వల కారణంగా ప్రశాంతి నగర్, గాంధీనగర్ ప్రాంతాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వ్యాపించడం, దోమలు పెరగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణానికి సమీపంలో చెత్తను డంపింగ్ చేయడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యర్థాలను పట్టణానికి దూరంగా ఉన్న ప్రాంతాలకు తరలించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. మేజర్ పంచాయతీ సిబ్బంది చర్యలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఏపీఆర్జేసీలో నాగ చైతన్యకు 70వ ర్యాంక్

**సారవకోట, మే 13(వార్త):** తొగిరి గ్రామానికి చెందిన నాగ చైతన్య ఏపీఆర్జేసీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 70వ ర్యాంక్ సాధించాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఎంఈసీ విభాగంలో 150 మార్కులకు గాను 96 మార్కులు సాధించి మెరిశాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ తన కుమారుణ్ని చదివించిన తండ్రి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం తనకు ఎంతో ఉపయోగపడిందని నాగ చైతన్య పేర్కొన్నాడు. నాగ చైతన్య సాధించిన విజయంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.



# ‘గో గ్రీన్’ సంస్థ కృషి అభినందనీయం

### -మందస ప్రధాన రహదారి సుందరీకరణ అద్భుతం

### -అటవీ శాఖ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు



**మందస, మే 13(వార్త):** మందసను పచ్చదనం చేయడానికి ‘గో గ్రీన్’ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని అటవీశాఖ కాశీబుగ్గ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు అన్నారు. మందస పట్టణంలోని ప్రధాన రహదారిలోని డివైడర్ మధ్య నాటిన మొక్కలకు ‘గో గ్రీన్’ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇనుము రక్షణ కంచెలు(ఐరన్ ట్రీగార్డ్స్) ఏర్పాటు కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడానికి గో గ్రీన్ మందస సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మొదటి రక్షణ గార్డును అమర్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో గ్రీన్ సంస్థ సభ్యుల కృషితో మందస ప్రధాన రహదారి పచ్చదనంతో కళకళలాడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే గరుడ గంగాధర గోవింద ఆలయం పక్కన ప్రభుత్వం తవ్వించిన చెరువు గట్టుపై కూడా వివిధ రకాల పూల మొక్కలను నాటి, ఆ ప్రాంతాన్ని సుందరీకరించాలని ఆయన సూచించారు. అనంతరం ప్రముఖ సంఘ సేవకుడు, ఆధ్యాత్మికవేత్త గిన్ని తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఐరన్ ట్రీగార్డ్స్ ఏర్పాటు కార్యక్రమం ప్రతీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు కొనసాగుతుందని తెలిపారు. ‘సాయిమోహన్ రిసోర్సెస్ ఫౌండేషన్’ ఆర్థిక సహకారం గో గ్రీన్ సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిందని ఆయన కొనియాడారు. పట్టణంలోని యువత మొక్కల సంరక్షణ కోసం నడుం బిగించడం గర్వకారణమని పలువురు వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో మందస డి.ఆర్.ఓ. పి.దేవరాజు, శానాపతి కిషోర్ కుమార్, మామిడి కోదండరావు, దేవరశెట్టి మార్కండేయులు, డాక్టర్ ఆర్.ఎస్.ప్రకాశ రావు, మల్లారెడ్డి రాజు, ఇప్పిలి కేశవరావు(చిట్టి), ప్రభాకర పట్నాయక్, శ్రీనివాస పాడి, మట్ట బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.




## వేణుగోపాలస్వామి గోమాత ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో దాసునాయుడు

**జలుమూరు, మే 13(వార్త):** దాలెప్పపేట-ఉప్పాడపేట గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి గోమాత ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు పాల్గొన్నారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో భక్తిమయ వాతావరణం నెలకొనగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గురుగుబెల్లి ఝాన్సీరాణి, జలుమూరు మండల సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ మునకోటి దామోదర్ రావు, కొత్తకోట కృష్ణ, ఉప్పాడ రమేష్, బలగ నర్సి, బలగ సింహాబలుడు, మునుగోటి గంగాధర్, తర్ర ప్రతాప్, తంగి కృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీదేవినగర్‌లో.. పారిశుధ్య సమస్య పరిష్కరించాలి



**నరసన్నపేట, మే 13(వార్త):** నరసన్నపేటలోని శ్రీదేవినగర్ కాలనీ వైపు అధికారులు దృష్టి సారించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. బుధవారం కాలనీవాసులు తమ సమస్యలను వెల్లడిస్తూ, గత మూడు సంవత్సరాలుగా శ్రీదేవి నగర్ వెనుక వీధిలో సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని తెలిపారు. చెత్త నిల్వల కారణంగా దుర్వాసన వ్యాపిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్న అధికారులు తమ కాలనీ పరిస్థితిని కూడా పరిశీలించాలని కోరుతున్నారు. మురుగు, చెత్త సమస్యల కారణంగా దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొన్నారు.

అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్య పనులు చేపట్టి కాలనీని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## రాంపురంలో దాహం కేకలు

### -అధికారులు స్పందించాలని గ్రామస్తుల వినతి

**మందస, మే 13(వార్త):** ఉద్దాన ప్రాంతమైన రాంపురం గ్రామంలో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. మందస మండలంలోని రాంపురం గ్రామం ప్రాధాన్యత ఉన్న గ్రామం. రాంపురం పంచాయతీ పరిధిలోని రాంపురం గ్రామంలో గత కొన్ని రోజులుగా గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గ్రామంలోని ప్రధాన తాగునీటి బోరు పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి కొరత మరింత ఎక్కువై చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు చాలా కష్టాలు పడుతున్నారు. ఈ సమస్యపై గ్రామ సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులకు గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి బోరును మరమ్మతు చేసి గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## తిమడాం హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో చలివేంద్రం

**జలుమూరు,మే 13 (వార్త):** తిమడాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. చలివేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారులు బి. మాధవరావు, ప్రసాద్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు సేవాభావం పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతను గుర్తించి విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

**జలుమూరు, మే 13(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవ రావు, ప్రసాద్‌రావు కోరారు. మంగళవారం జలుమూరులో “బడి పిలుస్తుంది” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ఉత్తమమని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## దేవాది ఫ్లైఓవర్‌పై నుంచి దూకి ఒకరి ఆత్మహత్య

**నరసన్నపేట, మే 13 (వార్త):** నరసన్నపేట మండలం దేవాది ఫ్లైఓవర్‌పై నుంచి గుర్తుతెలియని వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తో తెలియకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గణేశ్ తెలిపారు. మృతదేహాన్ని నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నరసన్నపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని ఎస్ఐ గణేశ్ విజ్ఞప్తి చేశారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు**

**- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతుల స్వీకరణ**



**పలాస, మే 13 (వార్త):** సామాన్య ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'గ్రీవెన్స్' (ప్రజా ఫిర్యాదుల) కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు పాల్గొని బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను బాబూరావు గారికి విన్నవించుకున్నారు. భూ వివాదాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, స్థానిక మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చిన వినతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ?ఈ సందర్భంగా వజ్జ బాబూరావు మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చడమే తెలుగుదేశం పార్టీ ప్రాథమిక బాధ్యతని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ముంగిటకే వచ్చి సేవలు అందిస్తోంది." అనంతరం, అందిన వినతులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సంబంధిత శాఖల అధికారులతో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకరరావు , పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పగడాలమ్మ మృతి



**మెళియాపుట్టి, మే 13(వార్త):** మాజీ ఎమ్మెల్యే చుక్క పగడాలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. పాతపట్నం నియోజకవర్గం పరిధిలో గల మెలియాపుట్టి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే చుక్క పగడాలమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. సర్జరీ సైతం చేయించుకున్నారు. దీంతో ఆమె తన స్వగ్రామం ముక్తాపురంలో బుధవారం తుది శ్వాస విడిచారు. ఎటువంటి రాజకీయ నేపథ్య పరిస్థితులు లేనప్పటికీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పగడాలమ్మ 1972లో పాతపట్నం నియోజకవర్గం నుంచి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆమె తన హయాంలో రోడ్ల నిర్మాణాలు, తాగునీటి బావులు ఏర్పాటు, ఎస్సీ హాస్టల్స్ మంజూరు తదితర వాటికి కృషి చేశారు. కరజాడలో ప్రభుత్వ హాస్పిటల్ ఏర్పాటు, పలాస-టెక్కలిపట్నం ప్రధాన రహదారి నిర్మాణం, పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్డు నిర్మాణం వంటివి ఆమె హాయాంలోనే జరిగాయి. ముఖ్యమంత్రులు పీవీ నరసింహారావు, జలగం వెంగళరావుతో పాటు అప్పట్లో మంత్రిగా పనిచేసిన లుకలాపు లక్ష్మణదాస్ సహకారంతో పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. భర్త మరణం తర్వాత ఇప్పటికీ తన స్వగ్రామంలో సామాన్య జీవితాన్ని ఆమె చివరి వరకు గడిపి తుది శ్వాస విడిచారని కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చుక్క పగడాలమ్మ మృతి చెందిన వార్త విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆమె స్వగ్రామం వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్. మోహనరావు తదితరులు ఉన్నారు.






### దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ..

## సీసీ కెమెరాలు తప్పనిసరి

**- ఎస్ఐ నరసింహమూర్తి**

**పలాస, మే 13 (వార్త):** దేవాలయాలకు చర్చిలకు మసీదు లకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి అన్నారు. మున్సిపాలిటీ శివాజీ నగర్ లో బుధవారం తన సిబ్బందితో సందర్శించారు. వార్డ్ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్‌లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీసులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యతకు క్రీడలు దోహదం



**పలాస, మే 13 (వార్త):** దేశ సమైక్యతకు క్రీడలు దోహదపడతాయని బొడ్డపాడు మాజీ యువజన సంఘం అధ్యక్షులు, సీనియర్ టిడిపి నాయకులు కిక్కిర ఢిల్లీ రావు అన్నారు.

బొడ్డపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గల మామిడిపల్లి గ్రామ క్రికెట్ క్రీడాకారులు నిర్వహించిన ఎంపీల్ సీజన్ - 6 విజేతకు 10,000 స్పాన్సర్ చేసి బుధవారం అందజేశారు. ప్రథమ స్థానం పొందిన ధ్రువ జట్టుకు బహుమతిను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలో గెలుపు ఓటములకు సహజమని, వాటంతో కుంగిపోకుండా విజయం కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామ పంచాయతీ సీనియర్ నాయకులు, 7వ వార్డ్ మెంబెర్ మురుపింటి కుమార్ రాజ్, సార జోగారావు, వైస్ సర్పంచ్ ప్రతినిధి వంకల మురళి, పిట్ట భువన్, కిక్కర తులసిరావు, నిరంజన్ పాణిగ్రహీ, జుత్తు రాజారావు, జడ్డే నేతాజీ, అల్లిబోయిన చలపతి, మామిడిపల్లి గ్రామ ఎంపిపి స్కూల్ ప్రగతి పదంలో నడిపిన మాష్టర్ కంచరాన రమేష్ మాష్టర్, మామిడిపల్లి గ్రామ క్రీడాకారులు, పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

### టి.బిడిమిలో వైభవంగా

## శ్రీచండేశ్వరి ఉత్సవం

**మందస, మే 13(వార్త):** టి.బిడిమిలో భక్తి, శ్రద్ధలతో శ్రీచండేశ్వరి దేవత ఉత్సవం జరిగింది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీ తిమ్మలబిడిమిలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉద్దానం ఆరాధ్య దైవమైన శ్రీచండేశ్వరి ఉత్సవాలను వైభవంగా ఈ ప్రాంతీయులు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా అమ్మవారి వార్షిక సంబరాలను గ్రామస్తులంతా కలసి, ఆనందంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలతో అమ్మవారిని ఊరేగించారు. మొక్కుకున్న మొక్కులను భక్తులు తీర్చుకున్నారు. ఆనవాయితీ వస్తున్న ప్రత్యేక పూజలు జరిపారు.



### నీట్ పేపర్ లీక్ ..

## యువత భవిష్యత్‌ను హత్య చేసే నేరం



**పలాస, మే 13 (వార్త):** దేశం కోసం చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును కొంతమంది రాజకీయ దందాగాళ్లు వేలం వేస్తుంటే...ఇది కేవలం నీట్ పేపర్ లీక్ కాదని, దేశ ప్రతిభను, పేదల ఆశలను, యువత భవిష్యత్తును హత్య చేసే నేరమని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుశిస్టు గోపి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీట్ లాంటి పరీక్ష కోసం లక్షలాది మంది విద్యార్థులు ఏళ్ల తరబడి నిద్ర మానేసి చదువుతుంటే ఇంకో వైపు డబ్బు, రాజకీయ అండ, మాఫియా లింకులతో ప్రశ్నపత్రాలు కొనేసుకుని సీట్లు దోచుకుంటున్నారని అన్నారు. రాజస్థాన్‌లో బీజేపీ నాయకుడు దినేష్ బింవాల్ అరెస్ట్ కావడం ఈ వ్యవస్థ ఎంత కుళ్లిపోయిందో బయటపెడుతోందని మండిపడ్డారు. రూ.30 లక్షలకు పేపర్ కొనడం వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపిణీ చేయడం ఇది ఒక్క వ్యక్తి పని కాదు, దేశాన్ని పురుగులా కొరుకుతున్న ఒక పెద్ద రాజకీయ-ఎగ్జామ్ మాఫియా పనని మండిపడ్డారు. దేశవ్యాప్తం నుంచి నీట్ వరక టెట్ నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్ వరకూ...ఎక్కడ చూసినా లీకులు, దందాలు, అవినీతని, అయితే బాధ మాత్రం ఎప్పుడూ పేద విద్యార్థిదేనని, ఒక రైతు తన పొలం అమ్మి కొడుకును కోచింగ్‌కు పంపిస్తాడని, ఒక తల్లి బంగారం తాకట్టు పెట్టి కూతురిని చదివిస్తుంది కానీ చివరికి సీటు దక్కేది డబ్బుతో ప్రశ్నపత్రం కొనేసుకున్న దందాగాడి పిల్లలకా?అని తెలిపారు. ఇది విద్యా వ్యవస్థ కాదు... ప్రతిభను ఉరి తీయించే అవినీతి రాజ్యం. దేశభక్తి పేర్లు పెట్టుకుని తిరిగే నాయకులు దేశ యువత భవిష్యత్తునే అమ్ముకుంటే వాళ్లు దేశ సేవకులు కాదు దేశ ద్రోహులు. యువత జీవితాలతో ఆడుకునే ఈ ఎగ్జామ్ మాఫియాలను చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని, లేకపోతే రేపటి తరం"చదివితే కాదు... డబ్బుంటేనే గెలుస్తాం" అనే నమ్మకంతో పెరుగుతుందని తెలిపారు. అది ఏ దేశానికైనా అత్యంత ప్రమాదకరమైన పతనమని హెచ్చరించారు.

### నేడు మామిడిపల్లిలో

## ఎమ్మెల్యే పర్యటన

**సోంపేట, మే 13(వార్త):** మామిడిపల్లి గ్రామంలో గురువారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ పర్యటించనున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు మద్దు కుమార్ తెలిపారు. గ్రామంలోని పలు వీధుల్లో సుమారు 56 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. అనంతరం గ్రామంలోని వెంకటేశ్వర కళావేదిక వద్ద జరగనున్న బహిరంగ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుమార్ కోరారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546